

పలాసలో డిప్యూటీ డిఇఒ కార్యాలయం

టెక్కలి : జిల్లాల విభజన అనంతరం ఏర్పడిన పలాస రెవెన్యూ డివిజన్‌లో నూతనంగా డిప్యూటీ డిఇఒ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కార్యాలయం పరిధిలో పలాస డివిజన్‌లోని నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాలను చేర్చారు. ఇప్పటివరకు ఈ మండలాలు టెక్కలి డిప్యూటీ డిఇఒ కార్యాలయం పరిధిలో ఉండేవి. పలాసలో కార్యాలయం ఏర్పాటుతో టెక్కలి డివిజన్‌లో టెక్కలి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, సారవకోట, ఎల్‌ఎన్‌పేట మండలాలు ఉండనున్నాయి. టెక్కలి డివిజన్ డిప్యూటీ డిఇఒగా గార పగడాలమ్మ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన పలాస డివిజన్ కార్యాలయానికి విజయలక్ష్మి డిప్యూటీ డిఇఒగా నియమించనున్నారని సమాచారం.

నేడు పంచాయతీ ఉప సమరం

- నాలుగు సర్పంచ్, పది వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నిక
- చివరి క్షణంలో రెండుచోట్ల వాయిదా
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 5,459 మంది ఓటర్లు
- సాయంత్రం ఫలితాలు వెల్లడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు శనివారం పోలింగ్ జరుగనుంది. మొత్తం 13 మండలాల పరిధిలో నాలుగు సర్పంచ్, 11 మంది వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో చివరి క్షణంలో పొందూరు మండలం గోకర్ణపల్లి పంచాయతీలోని రెండో వార్డు, సంతబొమ్మాళి మండలం సంతబొమ్మాళి పంచాయతీలోని 12వ వార్డు ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికకు అంతా సిద్ధమవుతున్న తరుణంలో ఓటర్ల జాబితాలో అవకతవకలపై అభ్యర్థి జి.నరసింహారావు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఎన్నిక వాయిదా పడింది. బ్యాలెట్ విధానంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. బ్యాలెట్ విధానంలోనే పోలింగ్ జరుగనుంది.

జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల స్థానాల ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల ఆరో తేదీన నోటిఫికేషన్ వెలువరించింది. ఆరు పంచాయతీలు, 96 వార్డు మెంబర్లకు ఎన్నిక కోసం ప్రకటన ఇచ్చారు. వాటిలో కోటబొమ్మాళి మండలం పట్టుపురం పంచాయతీకి ఒక్కరూ నామినేషన్ దాఖలు చేయలేదు. ఆ స్థానాన్ని ఎస్‌టికి రిజర్వేషన్ చేయడం, పంచాయతీలో ఎవరూ లేకపోవడంతో నామినేషన్లు రాలేదు. ఆమదాలవలస మండలం అక్కివరం పంచాయతీ ఏకగ్రీవమైంది. దీంతో నాలుగు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. వార్డు మెంబర్లకు సంబంధించి 96 స్థానాలకు నోటిఫికేషన్ ఇవ్వగా 18 చోట్ల ఒక్కరూ నామినేషన్ దాఖలు చేయలేదు. మరో 66 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. పొందూరు మండలం గోకర్ణ పల్లి, సంతబొమ్మాళి పంచాయతీలోని 12వ వార్డు ఎన్నిక వాయిదా పడడంతో మిగిలిన పది స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ స్థానాలకు 29 మంది, వార్డు మెంబర్ల స్థానాలకు 29 మంది పోటీలో ఉన్నారు.

పోలింగ్ జరిగే ప్రాంతాలు ఇవే

మండలం	సర్పంచ్ స్థానం
సరుబుజ్జిలి	బొప్పడాం
నందిగాం	అన్నవరం
సారవకోట	బద్రి
బూర్జ	పెద్ద లంకాం

వార్డు మెంబర్ల స్థానాలు

మండలం	పంచాయతీ	వార్డు నంబరు
టెక్కలి	నర్సింగపల్లి	7
సరుబుజ్జిలి	తెలికిపెంట	10
పోలాకి	కొత్తరేవు	1
	ఘాతలవలస	6
ఆమదాలవలస	కొరపాం	4
జలుమూరు	జోణంకి	2
ఎచ్చెర్ల	డి.మత్స్యలేశం	6
నరసన్నపేట	కోమర్తి	3
	మాకివలస	2
వజ్రపుకొత్తూరు	యుజి పురం	4



బూర్జ : పెద్దలంకాం పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది, పోలీసులు

5,459 మంది ఓటర్లు

ఎన్నికల్లో మొత్తం 5,459 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 2,640 పురుషులు, 2,519 మంది మహిళలు ఉన్నారు. ఎన్నికల కోసం మొత్తం 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు అవసరమైన 1,590 బ్యాలెట్ బాక్సులను ఆయా కేంద్రాలకు చేర్చారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కోసం 113 మంది మొదటి ఆర్‌ఒలు, 23 మంది రెండో ఆర్‌ఒలను నియమించారు.

25 మంది పోలింగ్ అధికారులను నియమించారు. 48 మందిని పోలింగ్ సహాయక సిబ్బందిని నియమించారు. రూట్ అధికారులు, జోనల్ అధికారులుగా 16 మంది చొప్పున నియమించారు. ముగ్గురిని సూక్ష్మ పరిశీలకులను నియమించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. వెబ్‌కాస్టింగ్ కోసం 16 మందిని ఏర్పాటు చేశారు.

ఎన్నిక వాయిదాకు కారణాలు ఇవే...

ప్రజాశక్తి - పొందూరు, సంతబొమ్మాళి

పొందూరు మండలం గోకర్ణపల్లిలో శనివారం నిర్వహించాల్సిన పంచాయతీ రెండో వార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. అధికార పార్టీ ఒత్తిడి మేరకు పంచాయతీ అధికారులు ఓటరు జాబితాను ట్యాంపరింగ్ చేశారని అభ్యర్థి జి.నరసింహారావు, మాజీ ఎంపిటిసి సీపాన శ్రీరంగనాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది.

సంతబొమ్మాళి పంచాయితీ 12వ వార్డు ఎన్నిక ఈనెల 23వ తేదీకి వాయిదా పడింది. వార్డు మెంబర్ పదవుల కోసం పోటీ చేస్తున్న చమళ్ళ అనుసూయమ్మ, రెయ్యి బాలకృష్ణకు కేటాయించిన గుర్తులు తారుమారు కావడంతో, అధికారులు స్పందించి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎన్నికను ఈనెల 23వ తేదీకి వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

మధ్యాహ్నం రెండు గంటల తర్వాత లెక్కింపు

పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి ఒంటి గంట వరకు కొనసాగనుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కౌంటింగ్ కోసం 16 మంది సూపర్‌వైజర్లను నియమించారు. సహాయక సిబ్బందిగా 32 మందిని నియమించారు. లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడించి, గెలుపు ధ్రువీకరణ పత్రాలను అందజేయనున్నారు.



ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

పని సర్దుబాటును రద్దు చేయాలి

డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన

శ్రీకాకుళం అర్బన్ : జిఒ నంబరు 117 ఆధారంగా చేస్తున్న పని సర్దుబాటును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు మాట్లాడుతూ బదిలీలు, ఉద్యోగోన్నతులు, రీఅపోర్షన్‌మెంట్ జరిగిన ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఆన్యాయమన్నారు. అధికారంలోకి రాక ముందు సిపిఎస్‌ను రద్దు చేస్తానని నమ్మించి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఇంతవరకు నెరవేర్చలేదని విమర్శించారు. ఉపాధ్యాయులను తీవ్రమైన పనిఒత్తిడికి గురిచేయడం సరికాదన్నారు. విద్యార్థులతో బలవంతంగా ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయించడం మానుకోవాలన్నారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర, జి.గిరిధర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పొందూరు అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, ఎపిటిఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి టెంక చలపతిరావు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సమస్యలపై శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది వ్యక్తిగత, ఇతర సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించి వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమమే ప్రధాన లక్ష్యమన్నారు. వృత్తిపరంగా, ఆరోగ్యపరంగా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది వారి సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే తక్షణం పరిష్కరించనున్నట్లు తెలిపారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌పి రాధిక

మహిళా కళాశాలకు అరుదైన ఘనత

ఐఎస్‌ఒ 21001 సర్టిఫికేట్ అందజేత

శ్రీకాకుళం : నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అరుదైన ఘనత దక్కించుకుంది. ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లోని తొలిసారిగా కళాశాలకు ప్రతిష్టాత్మక ఐఎస్‌ఒ 21001 సర్టిఫికేట్ పొందింది. ఐఎస్‌ఒ చైర్మన్ ఎ.శివయ్య కళాశాలను శుక్రవారం సందర్శించి ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్టిఫికేట్ ఆధారంగానే ప్రభుత్వం కళాశాలల నాణ్యత, ప్రమాణాలు తెలుస్తాయని చెప్పారు. నాక్ (ఎన్‌ఎఎసి) బృందం సందర్శించి గ్రేడ్ ఇచ్చే సందర్భంలో ఇది ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. వీటితోపాటు ఐఎస్‌ఒ 14001 సర్టిఫికేట్, 2015 ఎన్విరాన్‌మెంటల్ స్టాండర్డ్స్, 2018 ఎనర్జీ స్టాండర్డ్స్‌కు సంబంధించి ఐఎస్‌ఒ 50001 సర్టిఫికేట్లనూ ఆయన అందించారు. రెన్యువల్ సందర్శనలో భాగంగా కళాశాలలోని అన్ని శాఖలను, లేబొరేటరీలను పరిశీలించారు. గ్రీన్ హవెస్టింగ్, రిజల్ట్ ఎనాలసిస్, ఆడిట్, ఐక్యుఎసి నివేదికలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలో అన్నిరకాల అంశాల్లో పనితీరు ప్రశంసనీయంగా ఉందని కితాబునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, నరసన్నపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లత, టెక్కలి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ గోవిందమ్మ, పాతపట్నం కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీరాములు పాల్గొన్నారు.



సర్టిఫికేట్‌ను అందుకుంటున్న ప్రిన్సిపల్ సూర్యచంద్రరావు తదితరులు

ఓటర్ల సర్వేపై కలెక్టర్‌కు అభినందన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో 90 శాతం ఓటర్ల ఇంటింటి సర్వే పూర్తి చేయడంపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా అభినందించారు. మిగిలిన పది శాతం కూడా రానున్న మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఓటర్ల సర్వేపై శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సర్వే ముగిసిన తర్వాత బిఎల్‌ఒల యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల తొలగింపునకు ముందు సంబంధిత వ్యక్తుల ఇళ్లకు రిజిస్టర్ పోస్టు ద్వారా ముందస్తు నోటీసు జారీ చేయాలన్నారు. నోటీసు జారీ అయిన 15 రోజుల తర్వాత నిర్ధారించుకొని తొలగింపులు చేయాలని స్పష్టం చేశారు. గతేడాది జనవరి ఆరు నుంచి ఈనెల పదో తేదీ వరకు జరిగిన తొలగింపు ఓటర్ల జాబితాలను పున:పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 5,87,150 గృహాలకు గానూ 5,26,294 గృహాలను సందర్శించి 90 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. 18,06,841 మంది ఓటర్లకు గానూ 10,164 మంది ఓటర్లు మరణించినట్లు సర్వేలో నిర్ధారించినట్లు తెలిపారు. ప్రతి ఇంటినీ సర్వే చేయించి సందేహం ఉన్న చోట అధికారులతో పున:పరిశీలన చేయిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వైద్యంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల వైద్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు విమర్శించారు. జిల్లాలోని కార్మికులకు వైద్యసేవలు అందించేందుకు పోరాడి సాధించుకున్న ఇఎస్‌ఐ డిస్పెన్సరీలను అర్ధాంతరంగా మూసివేయడం తగదన్నారు. తక్షణమే ఎచ్చెర్ల, శ్రీకాకుళంలో ఇఎస్‌ఐ డిస్పెన్సరీలను తిరిగి ప్రారంభించి, మందులు అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లాస్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇఎస్‌ఐ పథకాన్ని బలోపేతం చేయాలని కోరారు. మూసివేసిన ఎచ్చెర్ల, శ్రీకాకుళం ఇఎస్‌ఐ డిస్పెన్సరీలను తెరిపించి వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించి కార్మికులకు వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇఎస్‌ఐ రిఫరల్ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. వేల మంది కార్మికులున్న ఎచ్చెర్ల ప్రాంతంలో, జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ఇఎస్‌ఐ డిస్పెన్సరీలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. 2019 మార్చిలో ఎచ్చెర్ల, శ్రీకాకుళంలో ఇఎస్‌ఐ డిస్పెన్సరీలు ఇఎస్‌ఐ కార్పొరేషన్ ప్రారంభించినా రాష్ట్ర ప్రభుత్వం వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో మూడేళ్లు అద్దె చెల్లించి కార్మికులకు ఎటువంటి సమాచారం లేకుండా గతేడాది సెప్టెంబరులో డిస్పెన్సరీలను మూసివేశారన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లాలో వంద పడకల ఇఎస్‌ఐ ఆస్పత్రి లేకపోవడం వల్ల ప్రమాదానికి గురైన కార్మికులకు సకాలంలో సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 28 వేల మంది కార్మికుల నుంచి బీమాగా ఇఎస్‌ఐ కార్పొరేషన్‌కు నెలకు సుమారు రూ.1.50 కోట్లు చెల్లిస్తున్నా, కార్మికులు సరైన వైద్యం అందడం లేదని విమర్శించారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అనారోగ్య సమస్య ఎదురైతే విశాఖపట్నం ఆరిలోవలోని ఇఎస్‌ఐ ఆస్పత్రికి వ్యయప్రయాసలతో జిల్లా నుంచి వెళ్లి రిఫరల్ రాయించుకోవాల్సి వస్తోందన్నారు. పైడిభీమవరంలో నిర్మిస్తున్న ఇఎస్‌ఐ పది పడకల డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణం కొన్ని ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదన్నారు. ఈ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పైడిభీమవరం ఇఎస్‌ఐ డిస్పెన్సరీలో ఐదుగురు స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, ఎ.మహాలక్ష్మి, కోశాధికారి ఎ.సత్యనారాయణ, నాయకులు ఎన్.గణపతి, కె.సూరయ్య, ఎస్.లక్ష్మీనారాయణ, హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

సాగులో సాంకేతిక పరిజ్ఞానం అవసరం

శ్రీకాకుళం అర్బన్ : సాగులో ఆధునిక యంత్ర పరికరాలను వినియోగించడం ద్వారా వ్యయాన్ని తగ్గించుకునేందుకు వీలుంటుందని, అందువల్ల రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి, ధాన్యం కొనుగోళ్ల కమిటీ సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సాగు ఇప్పటికే మొదలైందని, వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్న రైతులు యంత్ర పరికరాలను వినియోగించుకోవాలన్నారు. ఖరీఫ్ పంటలకు అవసరమైన నీటిని నీటిపారుదలశాఖ అధికారులు విడుదల చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణలో సంబంధిత అధికారులందరూ భాగస్వాములు కావాలన్నారు. గతంలో జరిగిన లోపాలను సమీక్షించుకుని ఈసారి మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈసారి 9.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట చేతికొస్తే వాటిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు అవసరమైన గోనెసంచులు, రవాణా, హమాలీలు, ధాన్యం సేకరణ కేంద్రాలు, ఎక్విప్‌మెంట్ తదితర అంశాలపై దృష్టిసారించినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు తక్కువ నీటితో వరి పంటను పండించేలా పైలట్ ప్రాజెక్టుగా ఎడబ్ల్యుడిని తీసుకొచ్చినట్లు చెప్పారు. నీటి వాడకాన్ని తగ్గించే రైతులకు సంస్థ ద్వారా పారితోషికం అందజేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో 1.62 లక్షల హెక్టార్లలో వరి పంటను వేయడమైందని, 9.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండే అవకాశం ఉందని అంచనా వేశామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎల్‌డిఎం ఎం.సూర్యకిరణ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి ప్రసాదరావు, మత్స్య, పశుసంవర్ధకశాఖల సంయుక్త సంచాలకులు పి.వి శ్రీనివాసరావు, ఎం.కిషోర్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో జువెనైల్ జస్టిస్ యాక్ట్ సభ్యులకు శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు వ్యక్తిగత బాధ్యత వహించి పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు. కేసులు పర్యవేక్షించే వాళ్లు చట్టంతో విభేదించడానికి గల కారణాలను శోధించి లోతైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పిల్లలు చట్టంతో విభేదించకుండా నిరోధించడానికి సూచనలు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జువైనల్ జస్టిస్ యాక్ట్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ శారదాంబ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, డిఇఒ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కె.ప్రకాశరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ఉద్యోగుల స్పందనకు 26 అర్జీలు

శ్రీకాకుళం అర్బన్ : ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్‌ను కలెక్టరేట్‌లో నిర్వహించారు. వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలపై 26 వినతులను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్వీకరించారు. గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ ఆధ్వర్యాన గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. 30 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్నా తాత్కాలిక ఉద్యోగులుగానే మిగిలిపోయామని, క్రమబద్ధీకరణ చేయాలని రణస్థలం జూనియర్ కాలేజ్ పార్టుటైమ్ లెక్చరర్ వై.శ్రీనివాసరావు కోరారు. ఉద్యోగుల స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలను జిల్లా స్థాయిలో అర్జీలు వస్తే సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపుతామని, రాష్ట్రస్థాయిలో వచ్చిన అర్జీల సమస్యలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. వినతులను స్వీకరించిన వారిలో డిఆర్‌ఒ మురళీకృష్ణ, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు, సెక్షన్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు

సరుబుజ్జిలి : రాష్ట్రంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటి కల్పన ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపడుతున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శాస్త్రులపేటలో సుమారు రూ.45 లక్షలతో, కూనజమ్మన్నపేటలో రూ.43 లక్షలతో, చిన్నషళంత్రిలో రూ.32 లక్షలతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మర్రిపాడులో రూ.21 లక్షలతో, బురిడివలసలో రూ.38.50 లక్షలతో జల జీవన్ మిషన్ ద్వారా పనులు పూర్తి చేసిన ఇంటింటికీ మంచినీటి కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.బి.జి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఎస్.నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బద్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి బంగారానికి ఎస్‌బిఐ గోల్డ్ బాండ్ స్కీమ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికుల నుంచి కానుకల రూపంలో వచ్చిన బంగారం, బంగారు వస్తువులకు ఎస్‌బిఐ గోల్డ్ బాండ్ స్కీమ్‌ను వర్తింపజేశారు. ఆలయంలో ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వి సురేష్‌బాబు, దేవాదాయశాఖ బంగారు ఆభరణాల తనిఖీ అధికారి అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యుల సమక్షంలో బంగారు వస్తువులను శుక్రవారం తూకం వేశారు. 7.215 కేజీల వస్తువులను గోల్డ్ కడ్డీలుగా మార్చేందుకు సిద్ధం చేసి ఎస్‌బిఐ విశాఖపట్నం ప్రతినిధులకు అందజేశారు. స్వామి వారి నిత్యాలంకరణలో వినియోగించే బంగారు ఆభరణాలు బ్యాంకులో భద్రపరుస్తున్నామని, చిన్న బంగారు వస్తువులను మాత్రమే గోల్డ్ బాండ్ స్కీమ్‌లో పొందుపరిచామని ఆలయ అధికారులు వివరించారు. త్వరలో వెండి వస్తువులకూ ఈ స్కీమ్‌ను వర్తింపజేసేందుకు బ్యాంకు అధికారులు అనుమతించారని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి చంద్రశేఖర్, ఆలయ పాలకమండలి సభ్యులు కొంచాడ సోమేశ్వరరావు, మండవిల్లి రవి, ఎస్‌బిఐ విశాఖపట్నం డిప్యూటీ మేనేజర్ డి.కుమార్, చీఫ్ మేనేజర్ బి.సుధీర్ కుమార్, ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులకు అందజేస్తున్న బంగారు నగలు

గ్రూప్‌-1లో సువర్ణ, దుష్యంత్‌ సత్తా


సువర్ణ దుష్యంత్‌కుమార్‌

నౌపడ : సంతబొమ్మాళి మండలానికి వరపటి సువర్ణ, మార్పు దుష్యంత్‌ కుమార్‌లు గురువారం విడులైన గ్రూప్‌-1 ఫలితాల్లో ఎంపికై సత్తా చాటారు. మండలంలోని దండు గోపాలపురానికి చెందిన దుష్యంత్‌ కుమార్‌ గ్రూప్‌-1లో ఉతీర్ణులై రాష్ట్ర వాణిజ్య పన్నుశాఖలో అసిస్టెంట్‌ కమిషనర్‌ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈయన సరసన్నపేట మండలం మాకివలన పిహెచ్‌లో వైద్యునిగా పనిచేస్తున్నారు. సెలవు పెట్టి ఢిల్లీలో సివిల్స్‌ శిక్షణ తీసుకుంటున్నారు. దుష్యంత్‌ కుమార్‌ తండ్రి ఆదినారాయణ విశ్రాంత ఉపాధ్యాయులు, తల్లి న్యాయవాది. తల్లిదండ్రులలో విశాఖ బికాలనీలో ఉంటున్నారు. అలాగే ఆకాశలఖవరానికి చెందిన వరపటి ధర్మారావు కుమార్తె వరపటి సువర్ణ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. రెండుళ్ల క్రితం గ్రూప్‌-1 పాసై జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అడ్మిస్ట్రేటివ్‌ విధుల్లో చేరింది. తర్వాత ఆమె ఉద్యోగానికి సెలవు పెట్టి ఢిల్లీలో సివిల్‌ కోచింగ్‌ తీసుకున్నారు. గ్రూప్‌-1 పరీక్షకు దరఖాస్తు చేసి పరీక్షలో సత్తా చాటి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. వీరికి ఆయా సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.


మాట్లాడుతున్న సుకుమార్‌

మగ్గం వర్క్‌తో అదనపు ఆదాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మగ్గం వర్క్‌తో మహిళలకు అదనపు ఆదాయం చేకూరుతుందని సిడిబి డిజిఎం సుకుమార్‌ అన్నారు. మండలంలోని శ్రీనివాసచార్యులపేటలో మహిళలకు బ్లాక్‌ పెయింటింగ్‌, మగ్గం వర్క్‌పై నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని సిడిబి బ్యాంకు సహకారంతో పెద్దపేట ఆర్ఫ్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత యూనిట్‌ ఏర్పాటు చేసుకుంటే మంచి ఆదాయం చేకూరుతుందని పేర్కొన్నారు. పెద్దపేట ఆర్ఫ్‌ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్‌ నూక సన్యాసిరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 60 మంది మహిళలకు బ్లాక్‌ పెయింటింగ్‌, మగ్గం వర్క్‌ల తయారీలో మంచి గిరాకీ ఉందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఫ్యాషన్‌కి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలందరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిక్కోలు చేనేత కంపెనీ చైర్మన్‌ వాసు, చిక్కోలు చేనేత కంపెనీ సిఇఒ భీమవరం అప్పలనాయుడు, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బెండి శంకరరావు, గ్రామీణ సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ సిహెచ్‌.సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్రికెట్‌ కామెంటేటర్‌గా శ్రీవర్ధన్‌


శ్రీవర్ధన్‌

శ్రీకాకుళం అర్బన్‌ : ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌ నిర్వహించనున్న ఆంధ్రా ప్రీమియం లీగ్‌ (ఎపిఎల్‌) సీజన్‌-2 క్రికెట్‌ పోటీలకు కామెంటేటరుగా జిల్లాకు చెందిన బొడ్డేపల్లి శ్రీవర్ధన్‌ ఎంపికయ్యారు. గతంలోనూ ఆయన ఆంధ్రా తరుపున ప్రాతినిధ్యం వహించారు. జిల్లా క్రికెట్‌ సంఘానికి కీలకంగా వ్యవహరిస్తున్నారు. గత నెలలో నిర్వహించిన జిల్లా సీనియర్స్‌ జట్టుకు సెలెక్టర్‌గా ఉంటూ నార్త్‌జోన్‌ విన్నర్స్‌ కావాడానికి కీలకంగా వ్యవహరించారు.

వైసిపి పాలనలో మహిళలకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి- పొందూరు

ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ అన్నారు. మండలంలోని గారపేటలో శుక్రవారం నిర్వహించిన మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి డ్వాక్రా సంఘాల ద్వారా కోటి మంది మహిళలకు రెండు సార్లు రూ.10 వేలు చొప్పున అందించారని గుర్తు చేశారు. మహిళలను మరింత బలోపేతం చేయాలంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని అన్నారు. మహిళలను మహరాణులను చేయడానికి మేనిఫెస్టోలో టిడిపి పెట్టిన పథకాలు మహిళలను ఆకట్టుకుంటున్నాయని అన్నారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి వస్తే చేయబోయే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కూన ప్రమీల, మండల పార్టీ


పొందూరు : పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్‌

అధ్యక్షులు సిహెచ్‌.రామ్మోహన్‌, ఎంపిటిసిలు బాడాన హారిక, ఎ.వాణి, నాయకులు అన్నెపు రాము, బలగ శంకరభాస్కర్‌, బాడాన గిరి, ఎ. చినరంగా, కె.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌ ఎ.విజయలక్ష్మి, మహేష్‌ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, వార్డు కౌన్సిలర్‌ ఆసీ లీలారాణి అన్నారు. మహాశక్తి కార్యక్రమంలో భాగంగా 11 వార్డు పరిధిలో శుక్రవారం పర్యటించిన టిడిపి మేనిఫెస్టో పోర్టలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందిక జాని, కొండా శంకర్‌రెడ్డి, రెయ్యి జాననికరామ్‌, కాళ్ల జైదేవ్‌, నందిగాం వెంకటేశ్వరరావు, నాగరాజుపాత్రో, కాళ్ల దిలీప్‌, పత్రి తవిటయ్య, నారాయణ బెహరా పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని మెంటాడ, దోనిపేట గ్రామాల్లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్‌ నాయకులు, ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణా తరగతుల మాజీ డైరెక్టర్‌ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం ఇంటింటికీ టిడిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాగోగులను, సమస్యలను ఆడిగి తెలుసుకున్నారు. టిడిపి మేనిఫెస్టోలో ప్రకటించిన భవిష్యత్‌ గ్యారెంటీ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

కేంద్ర మాజీ మంత్రి కృపారాణి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్‌

మాజీ ముఖ్యమంత్రి, ప్రత్యక్ష నేత చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్‌ కిల్లి కృపారాణి అన్నారు. తన స్వగృహంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా నీ పేరుతో ఏదైనా ఒక పథకం ప్రారంభించడం గాని, ఏ ప్రాజెక్టు అయినా కట్టి చూపించారా? అని ప్రశ్నించారు. విశాఖ బీచ్‌లో చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. 2047 విజనలో ఏముందని, గతంలో 20-20 అంటూ విజన్‌ ప్రకటించి ఏం చేశావని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలో బొడ్డుపల్లి రాజగోపాలరావు చొరవతో పేజ్‌-1 పూర్తి చేశారని, మాజీ సిఎం రాజశేఖరరెడ్డి పేజ్‌-2ను ప్రారంభించారని అన్నారు. అలాగే రూ.180 కోట్లతో గొట్టాబ్యారేజ్‌ దగ్గర లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పనులు పూర్తయ్యాని, త్వరలో ప్రారంభించి ఉద్దానానికి తాగునీరు అందిస్తామని తెలిపారు. రూ.850 కోట్లలో ఆఫ్‌షోర్‌ నిర్మాణ పనులు చేపడుతున్నామని అన్నారు. కిడ్నీలో రోగుల కోసం రూ.750 కోట్లతో పలాసలో ఆస్పత్రిని నిర్మిస్తున్నామని అన్నారు. అదీ త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం గతం కంటే ఈ ప్రభుత్వంలోనే పెరిగిందని అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వాస్తవాలు మాట్లాడితే ప్రజలు నమ్ముతారని అన్నారు. కార్యక్రమంలో పిఎస్‌సిఎస్‌ అధ్యక్షులు సత్తారు సత్యం, ఎంపిటిసి వాకాడ శ్రీధర్‌రెడ్డి, చుక్కాకుల జీవన్‌, బిర్లా కార్తిక్‌ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృపారాణి

అదే ఆదరణ

ప్రజాశక్తి- కవిటి

హెచ్‌ఎల్‌హెచ్‌ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ప్రగడపుట్టుగకు చెందిన యాంద్రాపు ఆద్య (తొమ్మిది నెలలు) వైద్యం కోసం దాతలు ఉదారంగా స్పందిస్తున్నారు. 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' అంటూ ఆగస్టు 15న 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. అప్పటి నుంచి దాతలు సాయం చేసేందుకు ముందుకొస్తున్నారు. నాలుగో రోజు శుక్రవారమూ దాతల నుంచి అదే స్పందన కొనసాగింది. ప్రగడపుట్టుగకు చెందిన యాదవ సంఘం తరఫున సేకరించిన రూ.40,316లను ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ చేతుల మీదుగా పాప తాతయ్య తులసయ్యకు అందించారు. కుసుంపురానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం


నగదును అందిస్తున్న మాతృమూర్తి సభ్యులు


నగదును అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌

సభ్యులు గ్రామానికి చేరుకుని తక్షణ సహాయంగా రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో కొర్రాయి వాసుదేవరావు, బదకల ప్రసాదరావు, చందాన తేజేశ్వరరావు, బదకల లక్ష్మణమూర్తి, బోరుబద్ర మోహనరావు, బదకల యర్రయ్య, మాతృమూర్తి సభ్యులు జుత్తు చలపతి, అంగ సురేష్‌, బి.భాస్కర్‌, నాగు, కుర్మారావు, లోళ్ల ధనుంజయం, బిసాయి మాధవరావు, కేత భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిక్కో సేవా సమితి సభ్యులు రూ.20 వేలు, ఇచ్ఛాపురానికి చెందిన జనసేన నాయకుడు తిప్పన దుర్యోధనరెడ్డి రూ.3 వేలు, ప్రగడపుట్టుగకు మాదిన అనిల్‌ కుమార్‌రాజా 5 వేలు, ముత్యాలపేటకు చెందిన ఆరింగి శివాజీ రూ.5 వేలు అందించారు. ఇప్పటివరకు దాతల నుంచి రూ.6.50 లోలు సాయం తనకు అందిందని పాప తండ్రి చిరంజీవి తెలిపారు.

వెంకయ్యపేటలో గ్రామసభ

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని 22వ వార్డు వెంకయ్యపేటలో ఇనాం భూములపై తహశీల్దార్‌ ఎస్‌.గణపతిరావు ఆధ్వర్యాన రైతులతో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇనాం దారుల వారసులు పట్టాదారు పాసుపుస్తకాలకు జిల్లా ఉన్నతాధికారులకు, మండల తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 308 ఎకరాలు ఇనాం భూములను రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇనాం దారుడుకు ఎకరాకు 33 1/2 సెంట్లు రైతుకు 66 1/2 సెంట్లు చెందాల్సి ఉందన్నారు. ఈ లెక్కన 208 ఎకరాలు రైతులకు వందెకరాల ఇనాందారుల వారసులకు చెందుతుందని అన్నారు. రైతులు ఈ విషయమై తమ


మాట్లాడుతున్న తహశీల్దార్‌ గణపతిరావు

అభిప్రాయాలు తెలపాలని కోరారు. వందేళ్ల నుంచి ఈ భూములను తామే సాగు చేస్తున్నామని, ఇనాములకు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పడంతో గ్రామ సభ ముగించారు. ఈ గ్రామసభలో మండల సర్వేయర్‌ బొడ్డేపల్లి గోపి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ శిరీష, న్యాయవాది మొదలవలస రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళా పోలీస్‌ మృతి


జ్యోతి (ఫైల్‌)

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని కాపుగోద యవలసకు చెందిన మహిళా పోలీస్‌ తామాడ జ్యోతి (37) పాము కాటుతో శుక్రవారం మృతి చెందిందారు. జ్యోతి కోటబొమ్మాళి మండలం తర్లిపేట గ్రామ సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 5.30 గంటల సమయంలో బాత్‌ రూమ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా చీకట్లో పాముపై కాలు పడడంతో కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా... మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతురాలికి ఆమెకు భర్త జయరాజ్‌, కుమారుడు రఘు ఉన్నారు. ఆమె మృతిపై సర్పంచ్‌ అంగ లక్ష్మి, ప్రతినిధి జనార్ధన్‌, ఎంపిటిసి వాడ్రేవు జగది విచారం వ్యక్తం చేశారు.

కాలువలో శిశువు మృతదేహం

పలాస : పలాస హడ్కో కాలనీలో ఓ మురుగు కాలువలో శిశువు మృతదేహం లభించడంతో స్థానికంగా కలకలం సృష్టించింది. శుక్రవారం వేకువజామున స్థానికులు రోడ్డుపై వెళ్తుండగా కుక్కలు ఎక్కువగా కాలువ చుట్టు తిరగడాన్ని గుర్తించారు. ఏమిటని ఆరా తీయగా శిశువు మృతదేహం కనిపించడంతో నివ్వెరపోయారు. బిడ్డకు ఏడు నెలలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు, వైద్యారోగ్యశాఖ అధికారులు చొరవ తీసుకొని భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని హడ్కో కాలనీ వాసులు కోరుతున్నారు.


'గుండ' దంపతులను సన్మానిస్తున్న రమణమూర్తి

ఎ-గ్రేడ్‌ రావడం ఆనందదాయకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్‌

తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయిలో సమన్వయపరచడంలో ఎ-గ్రేడ్‌ను సాధించడం ఆనందంగా ఉందని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ అన్నారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో గుండ దంపతులను నగర బిసి సెల్‌ ఆధ్వర్యాన శుక్రవారం సన్మానించారు. నిజయతీగల రాజకీయాలు చేస్తూ ప్రజాసేవలో కొనసాగడానికి సుదీర్ఘకాలం పాటు తన కుటుంబాన్ని ప్రజలు అందిస్తున్న సహకారమే కారణమన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్‌, నగర బిసిసెల్‌ అధ్యక్షులు అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి తేజాచక్రవర్తి

9న లోక్‌ అదాలత్‌

ప్రజాశక్తి- పలాస

పలాస సివిల్‌ కోర్టులో వచ్చే 9న జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి ఎస్‌.హెచ్‌.ఆర్‌.తేజాచక్రవర్తి తెలిపారు. పలాస కోర్టులో న్యాయవాదుల శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌ అదాలత్‌ ద్వారా కక్షిదారుల మధ్య రాజీ సూత్రంతో కేసులు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకుంటామనిని అన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్‌ అదాలత్‌ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు కాలం, ధనం వృథా అవుతుందని అన్నారు. అందుకు లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని రాజీ ద్వారా వాటిని కాపాడుకోవచ్చని అన్నారు. సాంఘిక, సామాజిక అభివృద్ధికి కక్షిదారులు లోక్‌ అదాలత్‌ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలాస బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు ఎన్‌.విశ్వేశ్వరరావు, కొమర దేవరాజు, కామేశ్వరరావు పట్నాయక్‌, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న లీలారావు

లీలారావుకు అభినందనలు

హిరమండలం : మండలంలోని గార్లపాడు నిర్వాసిత గ్రామానికి చెందిన అగతముది లీలారావు విశాఖపట్నం ఎయిర్‌ పోర్టులో సిఐగా పనిచేస్తున్నారు. ఈయనకు చేసిన సేవలకు గాను స్వతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం ఇన్‌ఛార్జి మంత్రి వి.రజని, కలెక్టర్‌ మల్లిఖార్జున చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. దీంతో గార్లపాడు గ్రామానికి చెందిన నిర్వాసితులు అభినందించారు. అభినందించిన వారిలో గవర గోవిందరావు, నారా శంకరరావు, లక్ష్మణరావు, నారా గడ్డెంనాయుడు ఉన్నారు.

నేషనల్‌ గ్రీన్‌కోర్‌

జిల్లా కో-ఆర్డినేటర్‌గా గోవిందరావు


గోవిందరావు

లావేరు : ఎపి నేషనల్‌ గ్రీన్‌కోర్‌ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పూజారి గోవిందరావును నియమిస్తూ డిఇఒ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన బుడుమూరు ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఈయనతో పాటు మరో పది మంది ఉపాధ్యాయులు క్లస్టర్‌ కో-ఆర్డినేటర్లుగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు వీరంతా కృషి చేస్తున్నారు. ఈయన నియామకంపై పాఠశాల ప్రధానోధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వైసిపి పాలనలో రోడ్లు గోతులమయం


గోతులను పుడ్చుతున్న జనసేన నాయకులు

వజ్రపుకొత్తూరు: వైసిపి పాలనలో రోడ్లన్నీ గోతులమయమయ్యాయని, నడవడానికి కూడా ఆపసోపాలు పడే దుస్థితి ఏర్పడిందని జనసేన నియోజకవర్గం నాయకుడు డాక్టర్‌ వి.దుర్గారావు అన్నారు. మండల కేంద్రం నగరంపల్లి ఉన్నత పాఠశాలకు ఎదురుగా రోడ్డు పూర్తిగా ఛిద్రం కావడంతో జనసైనికులతో కలిసి శుక్రవారం గోతులను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి మీదుగా మండల కాంప్లెక్స్‌ నిత్యం రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎదురుగా పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టదా? అని ప్రశ్నించారు. టెక్కలిపట్నం నుంచి నువ్వలరేవు వరకు డబుల్‌ రోడ్డు నిర్మాణం అంటూ ఊదరగొడుతున్న పాలకులు అది ఎప్పటికి మొదలవుతుంది వారికే తెలియాలని ఎద్దేవా చేశారు. రోడ్ల దుస్థితిపై జనసేన యుద్ధభేరి మోగిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసైనికులు లావేటి సురేష్‌, దువ్వాడ వంశీచౌదరి, విజయ్‌కుమార్‌, చింత మాధవరావు, బెహరా పద్మనాభం, వనజంగి ధనుంజయ్‌, పసుపురెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఐతమ్‌'లో పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్‌: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ మేనేజ్‌మెంట్‌ ఇంజినీరింగ్‌ కళాశాల బేసిక్‌ సైన్స్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ రాజమహంతి శాంతికుమార్‌, ఇదే విభాగానికి చెందిన ఉప విభాగాధిపతి ప్రొఫెసర్‌ అగతముడి లక్ష్మణరావు లు సంయుక్తంగా రచించిన 'ప్రాబులిటీ, స్టాటిస్టిక్స్‌ విత్‌ ఆర్‌ ప్రోగ్రామింగ్‌' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వి.వి. నాగేశ్వరరావు తన ఛాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కంప్యూటర్‌ రంగంలో అత్యధిక ప్రాధాన్యత సంతరించుకుంటున్న కృత్రిమ మేథ, మిషన్‌ లెర్నింగ్‌, డేటా ఎనాలసిస్‌, సైబర్‌సెక్యూరిటీస్‌, డేటా సైన్స్‌తో పాటు ఇతర రంగాల్లో పరిశోధనలు చేసే విద్యార్థులకు ఈ పుస్తకం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

ఎంతగానో ఉపయోగ పడుతుందని రచయితలు పేర్కొ న్నారు. ప్రస్తుత విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రచించిన ఈ పుస్తకంలోని అంశాలు విద్యార్థులకు సులువుగా అర్థమవుతాయని అన్నారు. ఇటువంటి మరిన్ని పుస్తకాలను రచించాలని డైరెక్టర్‌ ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎ.ఎస్‌.శ్రీనివాసరావు, పలువురు డీన్లు, హెబలు, బోధన, బోధనేతర సిబ్బంది రచయితలకు అభినందించారు.

పోటీ పరీక్షలపై ఆసక్తి పెంచుకోవాలి


మాట్లాడుతున్న మణిశర్మ

శ్రీకాకుళం అర్బన్‌ : విద్య పూర్తి చేసుకున్న తర్వాత విద్యార్థులు భవిష్యత్‌ ప్రణాళికాబద్ధంగా ఉండాలని జెసిఐ ప్రతినిధి వి.రాజేష్‌, ప్రెసిడెంట్‌ మణిశర్మ పేర్కొన్నారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఫైనల్‌ ఇయర్‌ ఇంజినీరింగ్‌ విద్యార్థులకు ఫ్యూచర్‌ పేరిట అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేస్తూ సమస్య ఎంత పెద్దదైనా చిన్న ఆలోచనతో పరిష్కారం లభిస్తుందన్నారు. ఆ దిశగా ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. పోటీ పరీక్షలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఎవరికైనా తరగతి గదిలో చదివిన తర్వాత అందులో క్లిష్ట తరమైన సమస్యగా అనిపిస్తే వెంటనే దాన్ని నివృత్తి చేసుకునేందుకు అధ్యాపకులతో చర్చించాలన్నారు. అప్పుడే ఆలోచనల్లో మార్పు సాధ్యమవుతుందన్నారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వై.శ్రీనివాసరావు, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జి.టి.చంద్రశేఖర్‌, జెసిఐ మధుబాబు పాల్గొన్నారు.

బ్యాంకులో బంగారం డిపాజిట్‌

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయానికి యాత్రికులు సమర్పించిన 750 గ్రాముల బంగారాన్ని విశాఖపట్నం స్టేట్‌బ్యాంకులో గోల్డ్‌బాండ్‌ స్కీం ద్వారా డిపాజిట్‌ చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. రాజమహేంద్రపురం బంగారు అభరణాల తనిఖీ అధికారి ఎం.వి.సురేష్‌బాబు, విశాఖపట్నం స్టేట్‌ బ్యాంక్‌


బంగారాన్ని డిపాజిట్‌ చేస్తున్న అధికారులు

ఆఫ్‌ ఇండియా అధికారుల సమక్షంలో ఈ డిపాజిట్‌ చేశామని అన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

టెక్కలి రూరల్‌ : రక్తదానం చేసి ప్రమాదంలో ఉన్న విలువైన ప్రాణాలను కాపాడే సదకాశం కలిగినందున ప్రతి ఒక్క రక్తదాతా గర్వించాలని టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ మేనేజ్‌మెంట్‌ ఇంజినీరింగ్‌ కళాశాల డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. ఐతమ్‌ ఎన్‌ఎస్‌ఎస్‌, శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి, 'చేయి.. చేయి.. కలుపుదాం' స్వచ్ఛంద సంస్థ'ల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 97 మంది


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఐతమ్‌ విద్యార్థులు సమాజ సేవలో ముందుండడం తనకు ఎంతో ఆనందం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లను, ఇతర సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి వైద్యాధికారులు భరద్వాజ్‌, లిఖిత, టెక్కలి జిల్లా ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్‌, కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎ.ఎస్‌.శ్రీనివాసరావు, డీన్‌ డాక్టర్‌ డి.విష్ణుమూర్తి, అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ ఎం.జయమన్మథరావు, ఎన్‌ఎస్‌ఎస్‌ పిఒ డాక్టర్‌ బి.బలరాం, ఫ్యాకల్టీ వాలంటీర్లు ప్రకాశరావు, నర్సిమ్మూర్తి, చంద్రశేఖర్‌, చేయి చేయి కలుపుదాం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎస్‌.సంతోష్‌, కార్యదర్శి బి.వినోద్‌కుమార్‌ పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్‌ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శుక్రవారం అనకాపల్లి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆయనకు ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఇప్పిలి శంకర శర్మ స్వామివారి శేషవస్త్రాన్ని కప్పారు. అనంతరం చిత్రపటాన్ని ఆలయ ఇఒ వి.హరిసూర్య ప్రకాష్‌ అందజేశారు.


మాట్లాడుతున్న రాజగోపాల్‌

ఈ-క్రాప్‌ తప్పనిసరి

ప్రజాశక్తి- కొత్తూరు

రైతులు వేసిన ప్రతి పంటకూ ఈ-క్రాప్‌ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఎడి బొడ్డేపల్లి రాజగోపాల్‌ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. అనంతరం రసాయన ఎరువుల విక్రయాలపై అడిగి తెలుసుకున్నారు. తెగుళ్ల, పరుగు మందుల వినియోగం వివరాలు సేకరించారు. సమావేశంలో పిఎఒ జి.హరికృష్ణ, పిహెచ్‌ఒ ఎస్‌.వి.గణేష్‌, మండల ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి సంకల్పయాత్ర

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాతపట్నం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు కోరారు. పాతపట్నం సమగ్రాభివృద్ధి సంకల్ప యాత్ర మండలంలోని పడ్డ, గొడ్డ, ఇలైపురం, ముకుందపురం, డబారు, జలక లింగుపురం, మర్రిపాడు తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలస, వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు. ఎవరికీ టిక్కెట్‌ ఇచ్చినా విషయం, పరిజ్ఞానం తెలిసిన వారికి చోటు కల్పించాలన్నారు. స్వార్థ రాజకీయాల వల్ల పాతపట్నం వెనుకబడి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వలస, వారసత్వ రాజకీయాలపై తెలియజేయడానికి ఈ సంకల్ప యాత్ర చేస్తున్నట్లు


సంకల్పయాత్ర నిర్వహిస్తున్న తేజేశ్వరరావు

తెలిపారు. వలసల నివారణ, యువతకు ఉపాధి కల్పించే నాయకులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందులో భాగంగ ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో సరాలి సర్పంచ్‌ పడాల షణ్ముఖరావు మాజీ సర్పంచ్‌ పడాల రాజారావు, సిరిపురం సేన సభ్యులు పాల్గొన్నారు.

ఖాదీ కార్మికులకు సన్మానం


ఖాదీ కార్మికులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

ప్రజాశక్తి- పొందూరు

ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఖాదీ కార్మికులను శుక్రవారం పొందూరు ఎఎఫ్‌కెకె సంఘం తరఫున ఘనంగా సన్మానించారు.


ప్రధాని కార్యాలయం ఆహ్వానం మేరకు పొందూరు పట్టణానికి చెందిన వడుకు కార్మికులు జల్లేపల్లి కాంతమ్మ, నేత కార్మికుడు బల్ల భద్రయ్య ఈ వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో సంఘం కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఎఫ్‌కెకె సంఘం అధ్యక్షులు గుంటుకు కామేశ్వరప్రసాద్‌, కార్యదర్శి దండా వెంకటరమణ, సంఘం ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

సభ్యుల అంతర్గత అప్పులకు ప్రాధాన్యం

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యుల మధ్య అంతర్గత అప్పులకు ప్రాధాన్యత ఉంటుందని వైఎస్‌ఆర్‌ క్రాంతి పథం అసిస్టెంట్‌ ప్రాజెక్టు మేనేజర్‌ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని కలివరం క్లస్టర్‌ స్థాయి సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయిలో 1174 సంఘాలు నెలవారి చేసుకున్న పొదుపు నిల్వలు బ్యాంకు ఖాతాల్లో రూ.12.61 కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరక 843 సంఘాలు రూ.4.17 కోట్లు పొదుపు నుంచి అప్పుగా సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. సిబ్బంది అందరూ ఫైనాన్స్‌ మేనేజ్‌మెంట్‌ శిక్షణ పొంది ఉన్నారని అన్నారు. అయినా సొంత నిధులను సంఘాలు సక్రమంగా వినియోగించుకునేటట్లు సిబ్బంది అవగాహన కల్పించలేకపోతున్నారని అన్నారు. సొంత నిధుల, సిఐఎఫ్‌, స్త్రీనిధులు రుణాలను వినియోగించుకుని మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. వైఎస్‌ఆర్‌ ఆసరా, చేయూత, సున్నా


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

వడ్డీ, వీధి వ్యాపారస్తులు, చిల్లర వర్తకులకు వడ్డీ లేకుండా ప్రభుత్వం అందిస్తున్న జగనన్న తోడు రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్‌ కో-ఆర్డినేటర్‌ మామిడి చంద్రరావు, ఎఫ్‌పిఒ సిసి రామప్పడు, కలివరం క్లస్టర్‌ విఒఎలు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

'హెల్పింగ్ హేండ్స్' అండ

కవిటి: మండలంలోని వరకకు చెందిన కిడ్నీ బాధితులు జమున జెన్నాకి స్థానిక హెల్పింగ్ హేండ్స్ సంస్థ అండగా నిలిచింది. పిస్టులా పాడవ్వడంతో ప్రస్తుతం జమునకు గుండె ద్వారా డయాలసిస్ చేస్తున్నారు. మళ్లీ పిస్టులా చేసుకునే ఆర్థిక స్తోమత లేని జమున దాతల సాయం కోరింది. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సభ్యులు శుక్రవారం గ్రామానికి చేరుకుని తక్షణ సహాయంగా జమునకు రూ.6వేలు అందించారు. పిస్టులా చేసే సమయంలో అవసరమైతే మళ్లీ సాయం చేస్తామని హామీ ఇచ్చారు.



అజొల్లాను చూపిస్తున్న రైతులు

'అజోల్లా' పిచికారీ

ఆమదాలవలస : ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే సారవంతమైన నేలతో పాటు విషతుల్యం లేని ఆహారాన్ని పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి తెలిపారు. మండలంలోనిచేపేనపేట, నిమ్మతొర్లివాడ, జి.కె.వలస, కొత్తవలస గ్రామాల్లో వరి పంటలో రైతులు చేత శుక్రవారం అజోల్లా వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పొలంలో అజోల్లా వేసుకుంటే కలుపు నివారణ పాటు నత్రజని అందుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, కృష్ణవేణి, లక్ష్మి, జానకిరామ్ పాల్గొన్నారు.

బూర్జలో కుక్కల బెడద

బూర్జ : మండలంలోని పలు కూడళ్లలో కుక్కల బెడత ఎక్కువగా ఉంటుంది. కొల్లివలసలో మాంసం దుకాణాలు ఉండడంతో వాటి వ్యర్థాలు తినేందుకు వస్తున్నాయి. అలాగే మండల కేంద్రం బూర్జలోనే కుక్కల సంచారం ఎక్కువగా ఉంటుంది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- పర్లాకిమిడి

ప్రతి బ్లాక్ కేంద్రాల్లో శీతల బాండాగారాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచారక అధ్యక్షులు బిజయ పట్నాయక్ డిమాండ్ చేశారు. గజపతి జిల్లా కాశీనగర్ స్టేట్ బ్యాంకు నుంచి బ్లాక్ కార్యాలయం వరకూ ప్రజా సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెడి ప్రభుత్వం బ్లాక్ స్థాయిలో నడుస్తున్న 15 నుంచి 50 శాతం పెర్సెంటేజ్ విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. ధాన్యం, తదితర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులో జరుగుతున్న మోసాలను అరికట్టాలన్నారు. విద్యుత్ లోవోల్టేజ్, విద్యుత్ కోతల సమస్యలను పరిష్కరించాలన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఇచ్చిన అధికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని అన్నారు. వారి హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంప్రసాద్ పట్నాయక్, సవర నాయుడు, రొక్కం జగ్గారావు, బోడాల బాలరాజు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ల విజయం గెలుపునకు నాంది

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామాల్లో తెలుగుదేశానికి ప్రజాదరణ ఉందని, రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు వార్డు మెంబర్ల విజయం నాంది కానుందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ గార మండలం బలరాంపురం, కొమ్మరవానిపేటలో టిడిపి వార్డు మెంబర్లు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు కొమరవానిపేట గ్రామంలో వార్డు మెంబరు వాసుపల్లి ఎల్లయమ్మను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు లోపింటి రాధాకృష్ణారెడ్డి, సర్పంచ్ వాసుపల్లి ఉమా, మండలం క్లస్టర్ ఇన్‌ఛార్జి అంబటి చక్రధర్, పొట్నూరు కృష్ణమూర్తి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, సర్పంచ్ చల్ల శ్రీను, వాసుపల్లి మల్లేశ్వరరావు, వాసుపల్లి పోలీసు, చోడిపల్లి రాజయ్య, దుమ్ము ఆదినారాయణ పాల్గొన్నారు.



ఎల్లయ్యమ్మను సన్మానిస్తున్న లక్ష్మీదేవి

అధ్వానంగా రహదారి



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని కొండపోలమ్మ కాలనీలో రోడ్లు, కాలువలు లేకపోవడంతో వాడుకనీరు, వర్షం కురిస్తే నడవలేనిస్థితిలో అధ్వానంగా ఉంది. రత్తకన్న 20 వార్డు పరిధిలో ఉండే కెపి కాలనీలో సరైన రోడ్లు, కాలువలు లేక నిత్యం ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారు. మామూలు రోజుల్లో నడవలేని స్థితిలో ఉండే ఈ కాలనీలో చిన్న చినుకు పడితే చాలా చిత్తడే చిత్తడి. రోడ్ల దుస్థితిపై చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డికి, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని కాలనీ వాసులు వాపోతున్నారు.



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

అవగాహన కల్పించాలి

టెక్కలి : సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాల వల్ల జరుగుతున్న నష్టాలపై ప్రజలకు వివిధ రూపాల ద్వారా అవగాహన కల్పిస్తూ... చైతన్యం కల్పించాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన గోపీనాథపురం ప్రాంతంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివాహ వయసు దాటిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలన్నారు. చదువుపై ఆసక్తి కనబరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, ఎంపిడిఒ హనుమంతు వెంకటరమణమూర్తి, తహశీల్దార్ కురమాన ప్రవళ్లికాప్రియ, ఎస్ఐ ఎల్.రామకృష్ణ, న్యాయవాదులు దవళ రాజేశ్వరరావు, ఖజానా వెంకటరావు, వైకుంఠరావు పాణిగ్రాహి, సాయిరాజ్, పేడాడ బాబూరావు, పైల చంద్రుడు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు హెచ్‌ఎం కోత చైతన్య అధ్యక్షతన బదిలీ ఉపాధ్యాయులు పి.అరుణశ్రీ, పి.భవాని, డి.సూర్యకాంతం, ఎం.సునీత, ఆర్.చంద్రశేఖరరావులను సిబ్బంది శుక్రవారం సన్మానించారు. సుదీర్ఘకాలం వారు పాఠశాలకు, విద్యార్థులకు అందించిన సేవలను గుర్తు చేసి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు ఆదికేశవరెడ్డి పాల్గొన్నారు.